AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
7-10-2025 (Tuesday)
MAIN EDITION

## ఆగని పసిడి పరుగులు..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** భారత మార్కెట్లో బంగారం ధరలు రోజు రోజుకు సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా డాలరు బలపడటం, అలాగే రూపాయి విలువ క్షీణించడం వంటివి పసిడి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా మారాయి. పెట్టుబడిదారులు గోల్డ్ వైపు ఎక్కువగా మొగ్గుచూపుతుండడంతో డిమాండ్ మరింతగా పెరుగుతోంది. మంగళవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,20,780గా పలికింది. 22 క్యారెట్ల బంగారం రేటు రూ. 1,10,710గా ట్రేడ్ అయింది. ఇంక వెండి కిలోకు రూ. 1,67,100 పలికింది.

## పాకిస్థాన్‌లో పేలుడు.. పట్టాలు తప్పిన రైలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పాకిస్థాన్‌లో మరోసారి పేలుడు చోటు చేసుకుంది. బలోచిస్తాన్ రెబల్స్ జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును లక్ష్యంగా చేసుకొని మంగళవారం దాడికి పాల్పడ్డారు. సింధ్‌బలూచిస్తాన్ సరిహద్దుకు సమీపంలో క్వెట్టాకు వెళ్లే జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను పేల్చడానికి వేర్పాటువాదులు యత్నించారు. దీంతో రైలు ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. కాగా.. ఈ దాడికి తామే కారణం అంటూ బలూచ్ రెబల్ గ్రూప్, బలూచ్ రిపబ్లిక్ గార్డ్స్ ప్రకటించాయి. రైలులో సైనికులు ప్రయాణిస్తుండటంతో దాడి చేసినట్లు బీఎల్‌జీ ప్రకటించింది.

## ఏసీ పేలి మహిళకు తీవ్రగాయాలు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: ఏసీ పేలి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన హైదరాబాద్ నగరంలోని బాచుపల్లిలోని సాయి అనురాగ్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. ఓ ఇంట్లో ఒక్కసారిగా ఏసీ పేలి మంటలు అంటుకుని జ్యోతి అనే మహిళకు గాయాలు అయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.**

## ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్ పురస్కారం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్: భౌతిక శాస్త్రంలో అపార ప్రతిభ కనబర్చిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి వరించింది. మాక్రోస్కోపిక్ క్వాంటమ్లో పరిశోధనలకు గాను జాన్ క్లార్క్, మిచెల్ హెచ్. డివోరెట్, జాన్ ఎం.మార్టిన్స్‌లను నోబెల్ పురస్కారానికి ఎంపిక చేశారు. డిసెంబర్ 10 వీరికి పురస్కారాలను అందించనున్నారు.**

## నకిలీ పీఎంవో అధికారిపై కేసు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్: నకిలీ పీఎంవో అధికారిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ప్రధాని కార్యాలయంలో డిప్యూటీ సెక్రెటరీగా పనిచేస్తున్నట్లు చెప్పుకొని రామారావు అనే వ్యక్తి టీటీడీ ఈవోకు సిఫార్సు లేఖ పంపాడు. దీనిపై పీఎంవో అసిస్టెంట్ డైరెక్టర్ ఏకేశర్మ ఫిర్యాదు మేరకు తాజాగా సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.**


## ఎర్రగడ్డలో అపార్ట్‌మెంట్ వాసుల ఆందోళన



**అక్షరటుడే, హైదరాబాద్:** నగరంలోని ఎర్రగడ్డలో పలువురు అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళనకు దిగారు. ఓ అపార్ట్‌మెంట్ వెనకవైపు శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది. దీనిని వ్యతిరేకిస్తూ అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన చేపట్టారు. వారికి మద్దతుగా బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అక్కడికి చేరుకున్నారు. కాగా.. ప్రభుత్వం కేటాయించిన స్థలంలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.

## తెలంగాణ టీడీపీ నేతలతో భేటీ కానున్న చంద్రబాబు

**అక్షరటుడే, అమరావతి:** తెలంగాణలో టీడీపీ విస్తరణపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ ఫోకస్ పెట్టారు. ఉండవల్లిలోని తన నివాసంలో చంద్రబాబు టీటీడీపీ నేతలతో మంగళవారం సాయంత్రం భేటీ కానున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, స్థానిక ఎన్నికలపై చర్చించనున్నారు. జూబ్లీహిల్స్ స్థానానికి నవంబర్ 11న ఎన్నిక జరగనుంది. ఇక్కడ టీడీపీకి క్యాడర్ ఉంది. దీంతో ఈ ఎన్నికల్లో పోటీ చేయాలా.. లేదంటే ఇతరులకు మద్దతు ఇవ్వాలనేదానిపై చర్చించనున్నారు. తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావాలని చంద్రబాబు కొంతకాలంగా ప్రయత్నిస్తున్నారు.



**మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో చిచ్చురేపాయి. అంతేకాకుండా రాష్ట్ర రాజకీయాల్లోనూ తీవ్ర చర్చకు దారి తీశాయి. తోటి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి ఆయన దున్నపోతు అని వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై దళిత సంఘాల నేతలు మండిపడుతున్నారు. మంత్రి అడ్లూరి సైతం బుధవారంలోగా పొన్నం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ వ్యవహారం తీవ్ర రూపం దాల్చడంతో పీసీసీ అధ్యక్షుడు రంగంలోకి దిగారు. ఇరువురు మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి సంయమనం పాటించాలని కోరారు.**



# కాంగ్రెస్‌లో పొన్నం చిచ్చు

- **మంత్రి అడ్లూరిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు**
- **మండిపడుతున్న దళిత సంఘాలు**
- **క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన లక్ష్మణ్‌కుమార్**
- **ఇద్దరు మంత్రులతో ఫోన్‌లో మాట్లాడిన పీసీసీ చీఫ్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్‌లో ఇటీవల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొనాల్సి ఉంది. అయితే అడ్లూరి ఆలస్యంగా వచ్చారు. దీంతో అసహనానికి లోనైనా పొన్నం పక్కనే ఉన్న మంత్రి వివేక్ చెవిలో గుసగుసలాడారు. ''మనకు సమయం తెలుసు.. జీవితం తెలుసు.. కానీ వారికేం తెలుసు ఆ దున్నపోతుగానికి'' అంటూ మాట్లాడారు. ఆ టైమ్‌లో మైక్ ఆన్‌లో ఉండడంతో ఆయన మాటలు బయటకు వినిపించాయి. ఈ వ్యాఖ్యలు మంత్రి అడ్లూరిని ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరిగింది. ఆయన మాటలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి స్పందించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. తనపై చేసిన వ్యాఖ్యలను ఖండించిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. మాదిగలు అంటే అంత చిన్న చూపా అని ఆయన ప్రశ్నించారు. ''ఆ మాటను సమర్థించుకొని ఇప్పటివరకు స్పందించకుండా ఉన్నావంటే నీ విజ్ఞతకే వదిలేస్తున్న''అని అన్నారు. సహచర మంత్రిని అంత మాట అంటే చూస్తూ ఉంటావా అంటూ మరో మంత్రి వివేక్‌ను సైతం ఆయన నిలదీశారు.

### పక్కన కూర్చుంటే వివేక్ వెళ్లిపోతున్నారు

తనపై చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ సామాజిక వర్గం నుంచి వచ్చిన తనను తక్కువగా చూస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి తమ జాతిని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పక్కన ఉంటే మంత్రి వివేక్ ఓర్చుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. పొన్నం వ్యాఖ్యలపై ఇప్పటికే ఆయన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు లేఖ రాశారు. సోనియా గాంధీని, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేను సైతం కలుస్తానన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీలో ఓ దళిత మంత్రికి ఇంతలా అవమానం జరగడం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైంది. తాను పక్కన కూర్చుంటే మరో దళిత మంత్రి వివేక్ లేచిపోతున్నారని అడ్లూరి చెప్పడం గమనార్హం.


### రంగంలోకి దిగిన పీసీసీ చీఫ్

ఇద్దరు మంత్రుల మధ్య పంచాయితీతో పార్టీకి నష్టం జరుగుతుందని భావించినా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ రంగంలోకి దిగారు. స్థానిక ఎన్నికల వేళ పొన్నం వ్యాఖ్యలతో పార్టీకి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. దీంతో మంత్రులు పొన్నం, అడ్లూరితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. సంయమనం పాటించాలని ఇద్దరికీ సూచించారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి సైతం పీసీసీ అధ్యక్షుడితో చర్చించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఇద్దరు మంత్రులతో బుధవారం పీసీసీ భేటీ కానుంది. ఈ మేరకు ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని పొన్నం, అడ్లూరికి మహేశ్‌గౌడ్ సూచించారు. ఇరువురితో మాట్లాడి ఇష్యూ సెటిల్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును ఆయన కోరారు.

### అడ్లూరిని అనలేదు

తాను దున్నపోతు అని మంత్రి అడ్లూరిని ఉద్దేశించి అనలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరణ ఇచ్చారు. తాను దున్నపోతు అన్నప్పుడు.. మంత్రి లక్ష్మణ్ పేరును ఎక్కడా ప్రస్తావించలేదని చెప్పారు. కమ్యూనికేషన్ గ్యాప్ తప్ప ఇంకేం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై అడ్లూరితో మాట్లాడేందుకు ప్రయత్నించాని, కానీ ఆయన అందుబాటులోకి రాలేదని తెలిపారు.

## 'సెల్‌ఫోన్ డ్రైవింగ్' చేస్తే కఠిన చర్యలు: సజ్జనార్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయి. అయినా కూడా కొందరు వాహనదారులు ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో అలాంటి వారికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ వార్నింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ సమయంలో ఫోన్‌లో వీడియోలు చూడడం, ఇయర్‌ఫోన్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో, క్యాబ్, బైక్ ట్యాక్సీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## స్థానిక ఎన్నికల్లో పోటీకి వీలు కల్పించాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హైకోర్టును ఆశ్రయించారు. తన పార్టీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్)ను పార్టీ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన సొంతంగా పార్టీ ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 17న తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. బీసీలకు అధికారమే తన లక్ష్యమని ప్రకటించారు.

### చర్యలు తీసుకోవాలని సూచన

మల్లన్న పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. టీఆర్పీ పార్టీ గుర్తింపు, గుర్తుపై ఆయన పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని కోరారు. దీనిపై వాదనలు విన్న ధర్మాసనం చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.


## పాన్‌ఇండియా స్టార్‌గా మారనున్న రుక్మిణి వసంత్..



**కన్నడ నాట సినీ ప్రస్థానం మొదలు పెట్టిన రుక్మిణి వసంత్.. కాంతార సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్, రామ్ చరణ్ – సుకుమార్ లాంటి బిగ్ లెవెల్ ప్రాజెక్టులతో పాన్ ఇండియా స్టార్ హీరోయిన్‌గా మారబోతుంది. రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన సంచలన చిత్రం "కాంతార చాప్టర్ 1" ఆమె కెరీర్‌ను పూర్తిగా మలుపు తిప్పింది. ఆ సినిమాలో రిషబ్ పక్కన హీరోయిన్‌గా నటించిన ఆమె తన సహజ నటన, నిబద్ధతతో ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. దీంతో రుక్మిణి ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌ల జాబితాలోకి చేరింది.**

**– అక్షరటుడే, సినిమా డెస్క్**

## తెలుగు రాష్ట్రాల్లో ఐటీ దాడులు




**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఐటీ అధికారులు దాడులు చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి పలువురు వ్యాపారుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 25 చోట్ల అధికారులు తనిఖీలు చేశారు. రూ.300 కోట్ల దాల్ ట్రేడ్ కేసులో హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాల్లో దాడులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో పలు కంపెనీలు భారీగా నగదు లావాదేవీలు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు. 2024 ఎన్నికల సమయంలోనూ భారీగా నగదు విత్‌డ్రా చేసినట్లు గుర్తించారు. పలు కంపెనీలు పౌరసరఫరాల శాఖ నుంచి అనుమతులు పొంది పప్పు దినుసులు సరఫరా చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఐటీకి ఫిర్యాదులు అందాయి. దీంతో పప్పుదినుసుల హోల్‌సేల్ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేపడుతున్నారు. గతంలో విశాఖపట్నంలో హిందుస్థాన్ ట్రేడర్స్, కర్నూలుల వీకేర్ గ్రూప్‌లో సైతం అధికారులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ అపర్ణ హోమ్స్‌లో నివసించే వెంకట్‌రెడ్డి ఇంట్లో సైతం అధికారులు సోదాలు చేపట్టారు. కూకట్‌పల్లి ప్రాంతాలో సైతం తనిఖీలు నిర్వహించారు. గత నెలలో సైతం ఐటీ అధికారులు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో దాడులు చేపట్టారు. హైదరాబాద్ నగరంతో పాటు, వరంగల్, నిజామాబాద్ నగరాల్లో తనిఖీలు చేశారు. బంగారు దుకాణాల వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేశారు. బంగారం కొనుగోలు పన్ను చెల్లింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు సోదాలు చేపట్టారు.

## చెరువులో ఓటరు కార్డులు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మధ్యప్రదేశ్‌లోని ఓ చెరువులో ఓటరు కార్డులు పడి ఉండటం కలకలం రేపింది. ఛతర్‌పుర్ జిల్లా బిజావర్‌లోని చెరువులో చెత్తను తొలగించడానికి పారిశుధ్య కార్మికులు వెళ్లారు. వారికి అక్కడ భారీగా ఓటరు కార్డులు కనిపించాయి. దీంతో వారు ఉన్నతాధికారులకు సమాచారమివ్వగా వారు వచ్చి కార్డులను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 500 ఓటరు కార్డులు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## కాంతారా చాప్టర్ 1పై స్టార్ క్రికెటర్ ప్రశంసల వర్షం



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** భారత స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్ కాంతార చాప్టర్ 1 సినిమాపై ప్రశంసలు కురిపించారు. రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన "కాంతారా చాప్టర్ 1" సినిమాను చూసిన అనంతరం, రాహుల్ తన సోషల్ మీడియా వేదికగా సినిమా గురించి ప్రత్యేకంగా పోస్ట్ చేశారు. 'ఈ మ్యాజిక్ చూసి మైండ్ బ్లాక్ అయ్యింది. రిషబ్ శెట్టి మరోసారి అద్భుతాన్ని సృష్టించారు. ఈ సినిమా మంగళూరుకు చెందిన ప్రజలను ఎంతో ప్రతిబింబిస్తుంది' అంటూ రాహుల్ ట్వీట్ చేశారు.